
విద్యుత్ దీపాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

బడంగ్‌పేట్‌లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

సరూర్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని ఉద్యోగ్‌నగర్, అన్నపూర్ణనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం రాత్రి కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో వెలుగులు నింపడానికి ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


దత్తాత్రేయ ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న పారిజాతారెడ్డి

'అలయ్ బలయ్'లో మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె దత్తాత్రేయతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఇతర ముఖ్య నాయకులను కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అలయ్ బలయ్ లాంటి కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహిస్తే అన్ని వర్గాల ప్రజలు, అన్ని పార్టీల నాయకుల్లో ఆత్మీయ భావం పెంపొందే అవకాశం ఉన్నదని ఈ సందర్భంగా పారిజాతారెడ్డి పేర్కొన్నారు.



సీ-డాక్ ఐఎస్ఈఏ రూపొందించిన మహిషాసుర మర్దిని సూచనల వెబ్ పోస్టర్

సైబర్ నేరాలపై సీ-డాక్ ప్రత్యేక వెబ్‌పోస్టర్

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కమ్యూనికేషన్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగం వారి సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) హైదరాబాద్ శాఖ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ) నిపుణులు సైబర్ నేరాలపై రూపొందించిన మహిషాసుర మర్దిని సూచనల పోస్టర్‌ను విడుదల చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కోసం సీ డాక్ తక్కువ నిడివి వీడియోలతో పాటు, పోస్టర్లనూ ప్రతిరోజూ విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో సీ-డాక్ సీనియర్ డైరెక్టర్ సీహెచ్ఏఎస్ మూర్తి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అందరికీ సులభంగా అర్థమయ్యేలా పోస్టర్లు రూపొందించి అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారుత. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు వెబ్ పోస్టర్లను విడుదల చేయడంతో నెటిజన్లు సీ డాక్, ఐఎస్ఈఏలను అభినందిస్తున్నారు.


అష్టలక్ష్మి ఆలయ ఆవరణలో రావణ దహన కార్యక్రమాన్ని చూసేందుకు వచ్చిన భక్తులు


పెద్దఅంబర్‌పేట్ రావణ దహనం కార్యక్రమంలో కళాకారులు, భక్తుల సందడి


సరూర్‌నగర్‌లోని షిర్డీసాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో రావణదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి తదితరులు


హయత్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాలపిట్టను గాల్లోకి వదులుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి

వైభవంగా దసరా మహోత్సవాలు

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి కాలనీలోని గోదా సమేత పద్మావతీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శాస్త్రోక్తంగా విజయ దశమి వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో దుర్గామాత ప్రతిమను ఏర్పాటు చేసి శరన్నవరాత్రి పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద రావణ దహన కార్యక్రమం చేపట్టారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్ పరిధిలో..

విజయదశమి వేడుకలను శనివారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉదయం వాహన పూజలతో పాటు ఆయుధ పూజలు నిర్వహించారు. మీర్‌పేట్ కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, బొక్క రాజేందర్‌రెడ్డి, ఎనుగుల అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాయి పీఠంలో..

మీర్‌పేట్‌లోని ప్రశాంతిహిల్స్ ద్వారకామాయి సాయి బాబా పీఠంలో పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీ డైరెక్టర్ ఎంఆర్‌సీ చౌదరి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్నేహపురి కాలనీలో దుర్గాదేవిని దర్శించుకున్న భక్తులు


ఎమ్మెల్యే సబితారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రాంరెడ్డి, కార్పొరేటర్లు

మీర్‌పేట్ బురుజు వద్ద..

మీర్‌పేట్ బురుజు వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్‌లో..

హయత్‌నగర్ రాఘవేంద్రనగర్ కాలనీ ఫేజ్-2లో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఆదివారం నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితారెడ్డికి శుభాకాంక్షలు..

మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. బాలాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు జి.రఘునందన్‌చారి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మని గిరీశ్, జూకంటి సురేశ్‌గౌడ్, కొప్పుల రాజు, మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు ఆదివారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో సబితారెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.


మీర్‌పేట్ బురుజు వద్ద దసరా సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి తదితరులు


ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బాలాపూర్ బీఆర్ఎస్ నేతలు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు


జమ్మిచెట్టు పూజలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి దంపతులు


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన విజయదశమి శమీపూజ వేడుకల్లో పాల్గొన్న ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి


కంచన్‌బాగ్ డీఆర్‌డీఎల్ టౌన్‌షిప్‌లో విజయదశమి వేడుకలను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.మూర్తి, ఎంఎస్ఎస్ డైరెక్టర్ రాజబాబు


బాలాపూర్‌లో జమ్మి పూజలో పాల్గొన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

రూ.1.84 లక్షలు పలికిన అమ్మవారి లడ్డూ ప్రసాదం

సరూర్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పది రోజుల పాటు కొనసాగిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం అమ్మవారిని ఊరేగించిన అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా రావుల నరసింహ రూ.1,84,444కు కైవసం చేసుకున్నాడు. అమ్మవారి చీరను రూ.1,65,500కు జక్కిడి సురేందర్‌రెడ్డి దక్కించుకున్నాడు. పూజలో ఉపయోగించిన కలశాన్ని వేలం వేయగా పుట్టగల్ల రాజు రూ.43 వేలకు సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు కొలను రాజవర్ధన్‌రెడ్డి, జక్కిడి గోవర్ధన్‌రెడ్డి, కొండా హేమంత్‌రెడ్డి, చిప్ప భాస్కర్, జక్కిడి సురేందర్‌రెడ్డి, గుండ్ల గణేశ్, కొలను మహిపాల్‌రెడ్డి, గొరిగె జంగయ్య, దడిగ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి లడ్డూను దక్కించుకున్న రావుల నరసింహ

దుర్గామాత మండపం వద్ద ఘర్షణ.. మహిళపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని ఏఎస్ఎస్ యూఆర్ఎం కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపం వద్ద ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ జరిగింది. కాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద శనివారం హోమం నిర్వహించారు. ఓ వర్గానికి చెందిన మహిళ సౌండ్ తగ్గించుకోవాంటూ మండపం వద్దకు చెప్పులు వేసుకుని వచ్చింది. దీంతో అక్కడే దుర్గామాత మాల ధరించిన మహిళ ఆమెను ప్రశ్నించింది. మాటమాట పెరగడంతో గొడవ చోటుచేసుకుంది. ఘర్షణలో మహిళా భక్తురాలు సొమ్మసిల్లి పడిపోవడంతో దాడికి పాల్పడిన మహిళపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు మండపం నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని దాడిచేసిన మహిళపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పండ్లను అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, భాస్కరాచారి


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం తుర్కయంజాల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి ఎమ్మెల్యేకు పండ్ల బుట్టను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పండుగుల జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి, కందాడ అనుపమాసుప్రసేనారెడ్డి, కాంగ్రెస్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కొండల్‌గౌడ్, కర్మన్‌ఘాట్ ఆలయ మాజీ ధర్మకర్త ఆనంద్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్‌గౌడ్, సురేష్‌బాబు, పవన్ తదితరులు హాజరై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశ్నించే గొంతుక మధుసూదనాచారి

● బీఆర్ఎస్ నేత శివప్రకాష్

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శాసనమండలి ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలను వినిపించే గొంతుక అవుతారని బీఆర్ఎస్ నాయకుడు సిరికొండ శివప్రకాష్ అన్నారు. మధుసూదనాచారి శాసనమండలి ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన కొత్తపేట, సాగర్‌రింగ్ రోడ్డులలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మారుతీనగర్‌లోని మల్లికార్జున వృద్ధాశ్రమంలో ఆశ్రమవాసులకు దుప్పట్లు పంపిణీ చేసి, ఆశ్రమవాసులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. సాగర్‌రింగ్‌రోడ్డులోని శ్రీకీర్తన అనాథాశ్రమంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట మహేష్ యాదవ్, విజయలక్ష్మి, మహిపాల్‌రెడ్డి, రాకేష్ కుమార్, సూర్య ప్రవీణ్‌చారి, ఉదయ్‌గౌడ్, నర్సిరెడ్డి, నిఖిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి ఎన్నికవడం బీసీలకు శుభపరిణామమని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు అన్నారు. ఆదివారం ఉదయం తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను చిరంజీవులు, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యాంసుందర్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారోజు రామాచారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ వాదన బలంగా నడుస్తున్న తరుణంలో బీసీ నేత మండలిలో ప్రతిపక్ష నేతగా ఎన్నికవడం శుభపరిణామమన్నారు. త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.


మధుసూదనాచారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నేత శివప్రకాష్

నిమ్స్‌లో సిద్ధమవుతున్న స్లీప్ ల్యాబ్

నిద్రలేమి, గురక, ఇతర శ్వాసకోశ, స్లీప్ అప్నియా నిర్ధారణ

● బాధితులకు 24 గంటలపాటు పరీక్షలు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ల్యాబ్ సిద్ధమవుతోంది. శ్వాసకోశ సంబంధిత సమస్యలను గుర్తించి చికిత్సలు అందించేందుకు ఈ ల్యాబ్‌ను రోగులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఓ రోగి సహాయకుడు ఇచ్చిన విరాళాలతో ఈ ల్యాబ్‌ను మరింత ఆధునికీకరించి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లో బాధితులకు పరీక్షలు చేయడానికి అవసరమైన బ్రాంకోస్కోపీ, సీపాప్ తదితర పరికరాలను కొనుగోలు చేశారు. నిద్రలేమి, గురక, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి నిమ్స్ స్లీప్ ల్యాబ్‌లో పరీక్షలు చేయనున్నారు.

స్లీప్ అప్నియాను టైప్1, 2, 3గా విభజించి..

గురక సమస్యను నిర్ధారించడానికి ఆస్పత్రిలో 24 గంటలు ఉండాల్సి వస్తుంది. రోగికి 24 గంటల పాటు స్లీప్ ల్యాబ్‌లో నిద్రలో అతడి అవయవాల పనితీరు, గుండె స్పందనలు, ఊపిరితిత్తులు, మెదడు కార్యకలాపాలు, శ్వాస విధానాలు, చేయి, కాలు కదలికలు, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను నిర్ధారిస్తారని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప తెలిపారు. ఈ పరీక్షలను పాలిసోమ్నోగ్రఫిగా వ్యవహరిస్తామన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా స్లీప్ అప్నియా టైప్ 1, 2, 3గా విభజించి విశ్లేషిస్తారని చెప్పారు. నిద్రపోతున్న సమయంలో గంటలో 5 నుంచి 20 సార్లు శ్వాస ఆగిపోతే దాన్ని మైల్డ్ గ్రేడ్‌గా భావిస్తామని, అలాగే గంటకు 20 నుంచి 40 సార్లు ఆగిపోతే దాన్ని మోడరేట్ గ్రేడ్‌గా లెక్కిస్తామని, తరువాత గంటకు 40 నుంచి 60 సార్లు అంతకన్నా ఎక్కువసార్లు ఆగిపోతే దాన్ని సీవియర్ గ్రేడ్ స్లీప్ అప్నియాగా పరిగణించి పరిస్థితిని తీవ్రంగా భావిస్తామని వైద్యులు వివరించారు.

పదిమందిలో ముగ్గురికి..

శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆస్పత్రికి వచ్చే ప్రతి పదిమందిలో ముగ్గురు తప్పనిసరిగా స్లీప్ అప్నియా బాధితులుంటున్నారని వైద్యులు తెలిపారు. పిల్లలు, పెద్దలు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారని ఇది స్లీప్ అప్నియాకు దారితీస్తుందన్నారు. గురక సమయంలో కొన్ని క్షణాలు శ్వాస ఆగిపోతుందని, ఈ సమయంలో ఆక్సిజన్ అందకపోడం, గుండెస్పందనలో తేడాలు రావడం, బీపీ పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నవుతున్నాయన్నారు. స్లీప్ అప్నియా పరీక్ష ద్వారా నిర్ధారణ జరిగిన తర్వాత ఏమైనా లోపాలు ఉంటే వాటికి దశల వారీగా చికిత్సలు అందిస్తారు. పరీక్ష ఫలితాల ఆధారంగా రోగికి అవసరమైన చికిత్సలు, వైద్య సలహాలు, అందిస్తామని తెలిపారు. శ్వాసనాళాల్లో అడ్డంకులు ఉంటే శస్త్రచికిత్సతో తొలగించడం, మరికొందరిలో జీవనశైలిలో మార్పులకు సంబంధించి సూచనలు సలహాలు అందిస్తామని వైద్యులు తెలిపారు.


కూల్చివేసిన ప్రీకాస్ట్ వాల్‌ను తిరిగి నిర్మించిన మొగులయ్య

ప్రీ కాస్ట్ గోడను నిర్మించుకున్న మొగులయ్య

హయత్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, 12 మెట్ల కిన్నెర వాయిద్యకారుడు మొగులయ్యకు ప్రభుత్వం బాగ్‌హయత్‌నగర్‌లో 600 గజాల స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. అయితే, గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ గోడను కూల్చివేశారు. దీంతో మొగులయ్య హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, ఆదివారం రెవెన్యూ, పోలీసుల సహకారంతో మొగులయ్య తిరిగి ప్రీకాస్ట్ గోడను నిర్మించుకున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

సైదాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శంకేశ్వర్‌బజార్ హనఫీయా మసీదులో ఆదివారం సీరత్ ఉన్ నబీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు, 125 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడు హసన్ బిన్ సాలే, కోశాధికారి ఆయాజ్ జహీర్, అర్షద్, మహమూద్ సిద్దిఖీ, మతీన్, నవాబ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.